" అవనీ...మీకు గుర్తుందో లేదోగానీ...మీరు ఒకసారి ఎవరితోనో ఫోనులో కొంచెం దేనికో గానీ గట్టిగా మాట్లాడటం విని తర్వాత నేను మిమ్మల్ని ' అదేంటి అంత ధాటీగా సమాధానం చెబుతున్నారూ ?' అనడిగాను. అప్పుడు మీరేం చెప్పారు ?   నిజాయితీగా పనిచేసేవాళ్ళకి భయమేమీ ఉండదు. ధైర్యంగానే సమాధానం చెప్పగలం అని! ఇప్పుడు...నాదీ అదే జవాబు అవనీ! నా వల్ల నాకు తెలియకుండా ఏదైనా తప్పు జరిగిందేమోగానీ, తెలిసీ నేనెటువంటి నేరమూ చేయలేదు! "

" వివరంగా చెప్పకూడదూ?"

" సరే...ఉత్తరం రాస్తాను...వివరంగా.."

" ఏమిటీ...ఉత్తరమా ?"

" ఎందుకంత ఆశ్చర్యం ? ప్రేమలేఖ కాదులెండి. ఎప్పటినుండో నా వివరాలూ చెప్పాలనుకుంటున్నా. ఇప్పుడు సందర్భం కుదిరింది కూడా...." అంటూ నవ్వి-

" మీరు ఇప్పుడేగా ఏం జరిగిందో తెలియజేయమని మెమో ఇచ్చారూ....రేపటికి నా సంజాయిషీ ఉత్తరం ద్వారా మీకు అందుతుంది!"

అవని కూడా ఆ మాటలకు సంతృప్తిపడినట్లుగా చిరునవ్వు చిందించింది.

ఒక క్షణం అతనివేపు ఇష్టంగా కూడా చూసి లేచి నిలబడింది.

చూపులు తీక్షణంగా వుంటాయేగానీ పెదవులమీద మాత్రం చిరునవ్వు ఎప్పుడూ తారట్లాడుతున్నట్లే ఉంటుంది! ఇంతటి ఆందోళన సమయంలోనూ చిరునవ్వు చెక్కుచెదరనీయలేదు!

నిజంగా గొప్పవాడే! లోలోన నవ్వుకుంటూ అనుకుంది అవని.

అవనిని అక్కడ చూసిన ఓ పెద్దాయన పెద్దపెద్ద అంగలతో వచ్చి అవనినీ, సుభాష్ నీ మార్చి మార్చి అనుమానంగా చూసి -

" ఇదేమిటమ్మా...నువ్వు...ఇక్కడ...ఇతనితో..." అని మాటలు మింగేశాడు.

అవని అతనివేపు చురుగ్గా చూసి " బాబాయ్...సుభాష్ గారితో నాకు నిశ్చయం" అలా పొడి పొడిగా చెప్పి " అదే మాట్లాడుకోవటానికి ఇక్కడకొచ్చాం! " కొంచెం తలవాల్చుకుని చెప్పింది.

ఆయన " ఆ.." అంటూ కళ్ళు తేలేసినట్లుగా అవనివేపు చూశాడు.

రెండడుగులు వేశాక " అదేమిటీ మీ ఊరు వాళ్ళతో అలా చెబితే ఎలా ? రేపటికి మిమ్మల్నీ ఈ గొడవలోకి లాగి మాట్లాడుకుంటారు!" అన్నాడు సుభాష్.

అవని చిరునవ్వుతో చూసి " అందరికీ తెలిసినా ఫర్వాలేదనే చెప్పా " నిబ్బరంగా అంది.

సుభాష్ ఒక క్షణం అలాగే నిలబడిపోయి...తెప్పరిల్లినట్లుగా అవని వేపు ఆనందంగా చూసి, " థాంక్స్ " అన్నాడు.

" దేనికీ ?"

" నన్ను...మనస్ఫూర్తిగా నమ్మి అంగీకరిస్తున్నందుకు..." అని అవని చేయి పట్టుకుని మృదువుగా నొక్కి వదిలేశాడు!

నిలువెల్లా పులకించిన భావం ఒక సెకనుసేపు అవని కనుదోయిలో ప్రతిఫలించింది. వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది.

*****

మరునాడు సెలవు పెట్టి అవని ఇంట్లోనే ఉండిపోవాలని నిర్ణయించుకుంది.

స్కూలుకి వెళ్ళటానికి రెడీ అయిన విస్సు వచ్చి " నీకిది సుభాష్ గారు ఇమ్మన్నారు. గుమ్మం దగ్గర్నుండే తిరిగి వెళ్ళిపోయారు..." అని చెప్పి కవరు అవని చేతిలో పెట్టాడు.

అందరూ తనవేపు ఆరాగా చూస్తుంటే " తన వివరాలన్నీ తెలియజేస్తానని సుభాష్ చెప్పారు " అని జవాబు చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

గదిలో తీరుబడిగా కూర్చుని కవరు తీసి చదవటం మొదలుపెట్టింది. చాలా ఆతురతగా ఉండి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

అవనీ,

నా గురించి....ఎక్కడనుండి మొదలుపెట్టాలో తెలియటంలేదు. చిన్నప్పటి జ్ఞాపకాలతో మొదలుపెడతాను. సరేనా ? ఓపిగ్గా వింటావుగా!

మా ఊరులో…పేరు ఏదైతేనేంలే..అందరిలానే నా బాల్యం పెద్దవాళ్ళ గారాబంతో, ఆటపాటల మధ్య ఆనందంగానే సాగింది.

ఉదయమే నాన్నమ్మ ఆలపించే దేవీస్తోత్రంతో నేను నిద్రలేచేవాడిని. ఆవిడ ' అయిగిరి నందిని…' అంటూ పాడుతుంటే విన్నవాళ్ళు భక్తి పారవశ్యంతో ఊగిపోవటమే ! ఎప్పుడూ అలా పూజలు చేస్తూండేది! ఇక మా నాన్న కోసం ఎందరెందరో రచయితలు, కవులు వస్తూండేవారు.

సాహిత్య చర్చలతో మా నాన్నకి సమయమే తెలిసేదికాదు.

ఏదో సందర్భంలో నాన్నగారూ వాళ్ళూ మాటలమధ్య గురజాడ గురించి చెప్పుకునే సమయంలో ' ఎల్లలోకమొక్క ఇల్లై..వర్ణ భేదములెల్ల కల్లై..' అనే వాక్యం విన్నాను. ఆ మాట పదే పదే నా మనసులో మననం చేసుకునేవాడిని! ఆ మాట నన్ను అంతగా ఆకట్టుకుంది.

అవనీ…మీ ఇంటికి వచ్చినప్పుడు…మీ ఇంటిలోనూ అలాంటి వాతావరణమేనని తెలిసి నాకు నా బాల్యం గుర్తుకువచ్చి….ఆనందపరవశుడిని చేసింది! అవును! ఒకవేపు మీ అమ్మమ్మగారి ఆధ్యాత్మికత..మరోవేపు మీ నాన్నమ్మగారి సాహిత్యాభిలాష…మీ ఇల్లు నేను కోల్పోయిన అనుభూతుల్ని తిరిగి అందించే అందాల హరివిల్లే అనే భావన కలిగింది కూడా !

మీ అందరిలోనూ నేనూ ఒకడిని కావాలని గాఢంగా కోరుకున్న కోరిక వెనుక వున్న కారణాలలో ఇదొకటి! చిన్నప్పుడు మా ఇంటిపక్కన ఒక ముస్లిం కుటుంబం ఉండేది. వాళ్ళతో మాకు మంచి స్నేహమూ ఉండేది. వీధి చివర ఇంటిలో నాన్న స్నేహితుడు ఇంకొకరు ఉండేవారు. వాళ్ళు క్రైస్తవులు. మేం హిందువులం. మా ఇంట్లో నిత్యమూ పూజా పునస్కారాలే.

అలా నాకు చిన్నతనంలోనే మూడు మతాలవారితో అనుబంధం ఉండటంతో ఆయా మతగ్రంథాలూ, కథలూ, సూక్తులూ తెలుసుకోగలిగాననుకుంటా. ఆ విషయాలలో నేను విజ్ఞానవంతుడిని కాదుగానీ…కొంచెంగా అవగాహన ఏర్పడిందని అనుకుంటాను.

అన్ని మతాల సారం ఒక్కటేనని ఎంతమంది ఎంత మొత్తుకుని చెప్పినా ఈ జనం ఎందుకు…ఎందుకు వినరు? మానవహితం కోసం మతం…అది తెలుసుకుని…ఏ దారి అయితేనేం, గమ్యం ఒకటేనన్నారుగా అని ఎందుకు ఆలోచించరు? తమ మతం వ్యాప్తి చెందాలనే కోరిక ఎందుకూ? ఇలాంటి ప్రశ్నలన్నీ నన్ను చిన్నతనంలోనే వేధించేవి.

కొంచెం పెద్దయ్యాక...దేముడిని నమ్మి పూజలూ, అభిషేకాలూ చేసే పెద్దలు పాపభీతి లేకుండా అక్రమాలకు ఎలా పాల్పడగలుగుతున్నారు? దేనిదారి దానిదేనా ? పూజలూ, ముడుపులతో ఇబ్బడిముబ్బడిగా పుణ్యం వచ్చేస్తుందా!..నాకు విడ్డూరంగానే అనిపించేది!

ఏసుక్రీస్తు సూక్తులూ, మహమ్మద్ ప్రవక్త బోధనలూ, హిందూ ధర్మాలూ అన్నీ ఆకళింపు చేసుకుంటూ పెరిగాను. మనసుకు నచ్చిన దారిలో పయనించటమే సరైనదని నాకు అనిపించేది. ఏ మతం అయినా, మత పెద్దలు అయినా మానవత్వం గురించే చెప్పారు! దానికే పెద్దపీట వేశారు! మాటలో...మనసులో స్వచ్ఛత! వృత్తిలో నిజాయితీ! ఇంతకుమించిన ఉత్తమమైన పూజావిధానం లేనేలేదని అన్ని మతాలూ చెప్పాయి!

ఇదే నేనూ నమ్మాను...పాటించాను కూడా!

అవనీ...ఏదో చెప్పాలని మొదలుపెట్టి ఇంకేదో చెబుతున్నట్లనిపిస్తోంది కదూ? నా ఆలోచనా విధానం నీకు తెలియజేయాలనే ఇదంతా చెప్పాను.

ఇక అసలు కథలోకి వస్తా. మా తాతగారు ఆనందరావుగారు దానధర్మాలు ఎంతగా చేసేవారో, దర్జాలకీ, ఆడంబరాలకీ కూడా అలాగే ఖర్చుపెట్టేవారట! ఏ విషయమూ పట్టించుకునేవారుకాదు, పర్యవేక్షణా ఉండేదికాదు. ఆస్తి కరిగిపోతూండటంతో కొంచెం మెలకువ తెచ్చుకుని ప్లాస్టిక్ వస్తువులేవో తయారుచేసే ఫ్యాక్టరీ కాటోలు మొదలుపెట్టారు! దానిని పట్టాలెక్కించటానికి కష్టపడాల్సి వచ్చింది. ఊళ్ళో వారందరూ పెట్టుబడులు పెట్టటానికి ముందుకు వచ్చారు.

పెద్దవాళ్ళే కాదు, చిన్న రైతులూ తమకూ లాభాలు వస్తాయనే భావంతో పెట్టారు..కానీ ఫ్యాక్టరీ నడవలేదు...లాభాలూ తెచ్చిపెట్టలేదు.

ఊరివారందరూ వచ్చి ఇదేంటని...తమకున్నదంతా ధారపోశామనీ మొత్తుకున్నారు. తాతగారు అప్పుడు జీవితం గడవటానికి కొద్దిపాటి ఆస్తులేవో ఉంచి, మిగతావన్నీ అమ్మకం పెట్టారు. ఆ డబ్బు, డబ్బు ఇచ్చిన రైతుల వివరాలు ఉన్న అకౌంట్స్ బుక్ వెంకటప్పయ్య అనే నమ్మకస్తుడి చేతిలో పెట్టారట తాతగారు. నమ్మిన వారిని నట్టేట ముంచినవిధంగా ఆయన ఆ డబ్బుతో పరారయ్యాడు. తాత తల పట్టుకోవటం తప్ప చేయగలిగిందేమీ లేకపోయింది.

ఆ ప్రభావం తాతగారి ఆరోగ్యం మీద పడింది. ఆయన పోవటంతో అందరూ తమ డబ్బు తిరిగి ఇవ్వాలని నాన్నని వేధించటం మొదలుపెట్టారు. నాన్నగారూ తాతగారిని అనుసరించి పైలోకాలకు వెళ్ళిపోయారు. ఐశ్వర్యాలతో వున్న కుటుంబం అలా చితికిపోవటం మాత్రమే కాదు అవమానాలూ భరించాల్సివచ్చింది. అదే అన్నింటికీ మించిన దురదృష్టం.

అమ్మ కూడా ఎప్పుడూ ఏదో దిగులుగా ఆలోచిస్తూనే ఉండేది. ఎందుకనోగానీ..అమ్మ కూడా నన్ను విడిచివెళ్ళాల్సివస్తుందనే నిజాన్ని ముందుగానే ఊహించింది కాబోలు, నన్ను పిలిచి తన కోరిక తెలియచెబుతూ నా చేతిలో ఓ కవరు పెట్టింది.

మా తాత ముత్తాతలదీ ఊరే...మధ్యలో అమ్మమ్మగారి ఊరికి మకాం మార్చాం. మా తాతగారి వయసువాళ్ళకి ఆయన పేరు తెలిసిఉండొచ్చు.

అమ్మ కోరిక మేరకే నేనీ ఊరువచ్చాను. ఆమెకి ఇచ్చిన మాట ప్రకారమే ఊరు అభివృద్ధి కోసం శ్రమించాను. ఇది మాత్రమే నిజం!

అవనీ...నీకు చెప్పానుగా ప్రతీ ఊరులో...దేవాలయంతోపాటుగా ముఖ్యమైన మరో మూడు ఆలయాలూ ఉండాలనేదే నా అభిప్రాయమని ! అంతేకాదు, ఊరివారందరూ కూడా తమ ఊరును బాగుచేసుకునే పనిలో పాలు పంచుకోవటమూ తప్పనిసరి అని భావించాలి!

అందుకే..కేవలం అమ్మ చెప్పినట్లుగా..తను ఇచ్చిన డబ్బును ఏదో కట్టించటంకోసం వినియోగించి, ఊరుకోవాలని అనుకోకుండా, అందరికీ భాగస్వామ్యం కల్పించాలనీ అనుకున్నాను.

అవును...అవనీ...ఆ మూడు ఆలయాల నిర్మాణం కోసం దేవాలయం చూపించే దారిని ఎన్నుకున్నాను. మనుష్యులందరికీ స్వార్ధం ఉండటం సహజమే!

ఎవరో కొందరు మాత్రమే నలుగురి కోసం తమకున్నదానిలో భాగం ఇచ్చి దాతృత్వం చూపించగలుగుతారు. చాలామంది మాత్రం తమ లాభాలూ, క్షేమాల కోసం పూజలూ, ముడుపులు ద్వారా భగవంతుడిని ఆశ్రయిస్తారు. అది వారు ఎన్నుకున్న మార్గం. ఎవరికీ ఎవరి నమ్మకాల్నీ కించపరిచే హక్కులేదు! అయితే నా నమ్మకం, ఆలోచన ప్రకారం..అందరూ...ఒక యజ్ఞంలా తలపెట్టిన అభివృద్ధికి సహకరించటానికి వీలుగా ఒక పథకం ఆలోచించాను. దాని ఫలితమే గుడిలో కొత్త పూజారి ప్రారంభించిన యజ్ఞాలూ, యాగాలూ...అన్నీ !

ఏ గుడి ఆదాయాన్ని అయినా ప్రజలకోసమే వినియోగించటంలో తప్పు ఏమీ లేదు. బడికో, హాస్పిటల్ కో అని కాకుండా గుడిలో చెల్లించే ముడుపుల ద్వారా భక్తులూ వాటికి వేరుగా కాకుండా భగవంతుడు...పుణ్యం అనే భావనతో చెల్లిస్తున్నారు! అంతే! నేను త్రికరణశుద్ధిగా నమ్మిన ఈ దారిలోనే నడిచాను. ఇది అమలు చేయటానికి నాకు నా స్నేహితుడు కృష్ణశాస్త్రి సహకరించాడు.

సరిగ్గా ఆ సమయానికే అతని తండ్రి ఆరోగ్యం బావుండక విశ్రాంతి తీసుకోవాల్సివచ్చింది. వాడికి నేను చేయాలనుకున్నదీ, అనుకుంటున్నదీ అంతా చెప్పాను.

కృష్ణశాస్త్రిది కూడా నా దారే. గమ్యం ఒకటిగా, ఏ దారిలో చేరుకుంటేనేం, ఇందులో అక్రమం ఏం లేదని అంగీకరించాడు. వాడు ఇంజనీరింగ్ చదివినా తండ్రి దగ్గర వేదాలూ, పురాణాలూ అన్నీ క్షుణ్ణంగా అభ్యసించాడు. తన అనారోగ్యరీత్యా గుడిలో పూజారిగా ఎవరిని నియమించాలా అని ఆయన అన్వేషిస్తోంటే, ఉద్యోగానికి రెండు మూడేళ్ళు సెలవు పెట్టి ఆ బాధ్యత తనే స్వీకరిస్తానని తండ్రిని ఒప్పించగలిగాడు!

ఏ పూజ...అభిషేకం, హోమం...ఏది తలపెట్టినా అన్నీ శాస్త్ర ప్రకారమే నిర్వర్తించాడు! అవును...పూజల పేరిట వచ్చిన ఆదాయం, విరాళాల ద్వారా సేకరించిన దానికంటే చాలా ఎక్కువే. ఇది నాకూ ఆశ్చర్యం కలిగించిన విషయమే!

నేను గుడికి వెళ్ళకపోయినా, కృష్ణశాస్త్రి గుడి ఆదాయాన్ని మాత్రం నాకు అప్పగించేవాడు. అవన్నీ ఎలా చేశామన్నది అప్రస్తుతం. ఆ వివరాలు తర్వాత చెప్పుకుందాం!

ఇదీ ఒక నిందారోపణ గురించి నా సంజాయిషీ. గుడి ఆదాయం పూర్తిగా ఈ ఊరు కోసం మాత్రమే వినియోగించబడింది! అందులో ఏ మాత్రం అసత్యం లేదు!

ఏ ఊరు అయినా ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ల కోసమే ఎదురుచూస్తూ కూర్చోకుండా...తమంతట తాముగా సాధించుకోగలిగే దిశగానూ అడుగెయ్యాలి! దానికి ఇదీ ఒక మార్గమే! చాలా మందికి నచ్చేది ఇదే కూడా! భగవంతుడు ఏ పనీ మనకు నేరుగా చేసిపెట్టడు! ఎన్నో రకాలుగా కరుణిస్తాడని అనుకుంటాంగా..ఇదీ అలాగే అనుకున్నాం మేమిద్దరం!

ఇక రెండోది.

భీమన్నను నేను కలవాలని అనుకున్నాను. వేరే పనిమీద ఈ ఊరు వచ్చానన్నదీ నిజమేననుకో. కలిశాను...కలిసి పని చేశాను. అపుడే నాకు ఏమేం చేయాలీ అనే ఆలోచనలు వచ్చాయి. అవన్నీ ఆచరణలో పెట్టే పనిలో తలమునకలుగా వున్నాను. ఆ సమయంలో నన్ను కలిసిన ఓ స్నేహితుడి మాటను పూర్తిగా ఆలోచించకుండానే సహకరిస్తానని మాట ఇచ్చాను.

అతను పోలీస్ డిపార్టెమెంట్ లోని వ్యక్తి.

గంజాయి సాగు చేస్తున్న ముఠాకి సహకరిస్తున్నాడనే అభియోగాన్ని అతను ఎదుర్కొంటున్నాడు. దాని నుండి బయటపడాలంటే..వాళ్ళని పట్టుకోగలటమే మార్గం.

అతనికి ఇచ్చిన మాట ప్రకారం...వాళ్ళకి నమ్మకం కలిగించటానికి గంజాయి సాగుతో సంబంధం ఉందన్నట్లుగా అపోహ కలిగించగలిగాను.

అలా వాళ్ళు ఏ విధంగా రవాణా చేస్తున్నారో కనిపెట్టగలిగాం. నాకు తెలిసిన కుటుంబంలోని కాలేజి కుర్రాడని చందు ద్వారా నాకు పంపించటం చేశారన్నమాట!

స్టూడెంట్స్ అయితే వాళ్ళ టిఫిన్ బాక్సుల్ని ఎవరూ తనిఖీ చేయరనే ఉద్దేశ్యంతో ఆ విధానాన్ని పాటించారు! ఏజెన్సీలనుండి వచ్చే పిల్లలకి కొద్దిపాటి ఆశ చూపించి ఈ విధానంద్వారానూ రవాణా చేయగలుగుతున్నారు! ఆ విధంగా ఆ ముఠాను పట్టివ్వగలిగాను! ఇదీ అసలు విషయం !

నేను తనకి సహకరించినందుకు నా మిత్రుడు నన్ను ప్రశంసలతో ముంచెత్తాడు...సన్మానం చేస్తానన్నాడు!

" ఇదంతా నాకు అవసరం లేదుగానీ, నాకు గంజాయి సాగు, అక్రమ రవాణా వ్యవహారాలతో సంబంధం లేదనీ, ఉన్నట్లుగా భ్రమింపచేసి పరోక్షంగా ...దోషులను పట్టుకోవటానికి సహకరించానని పేపర్లలో వార్త వస్తే అదే చాలునని చెప్పాను.

మనకో సామెత ఉంది తెలుసా!

'నిజం చీరె సింగారించేలోపు అబద్ధం ఊరంతా చుట్టేయగలదని! '

నిజంగా నిజమే ! నిజం నిదానంగానే బయటకు వస్తుంది!

నిజం తెలుసుకోవాలనే ఆసక్తి కంటే, సంచలన వార్తలుగా అనిపించే పుకార్లకే మనం మొగ్గు చూపిస్తాం ! అవునా ?

అవనీ....వివరంగా చెప్పానుగా. సందేహాలేం లేవుగా ?

ఇంకొకటి..మా అమ్మ నాకు ఇచ్చిన కవరునూ పంపిస్తున్నా...చదువు. అప్పుడు నీకు పూర్తిగా విషయం అర్థమవుతుంది!

నేను ఇక్కడ ఉండకపోయినా మా తాతగారి ఊరు అనే మమకారం ఉంది!

ప్రాయశ్చిత్తం అనుకుంటూ అమ్మ ఆదేశించినదేమిటో కూడా నీకు తెలుస్తుంది. ఈ విషయం ఎంతవరకూ ఊరివాళ్ళకి తెలియజేస్తావో...అది పూర్తిగా నీ బాధ్యతే...నీ ఇష్టమే !

జీవితంలో కలిసి ప్రయాణించాలని నిర్ణయించుకున్నవాళ్ళం . అందుకే నీకు మాత్రమే పూర్తిగా నా గురించి, నా పనులకు సంబంధించిన వివరాలనూ తెలియజేయాల్సిన అవసరం ఉంది! సరేనా....ఇక మా అమ్మ ఉత్తరం మొదలుపెట్టు.

--సుభాష్.

మనసును మూసేసిన తెరలన్నీ తొలగిపోయినట్లుగా అవని మనసు తేలికపడింది!

కాసేపు అతని గురించిన ఆలోచనల్లో మునిగిపోయిన అవని తెప్పరిల్లి, ఆ ఉత్తరమూ చదవటానికి చేతిలోకి తీసుకుంటున్న సమయంలో వరాలు వచ్చింది.

" అవనీ...ఇదంతా నా వల్లే జరిగింది కదూ ?"  దిగులుగా చూస్తూ అడిగింది.

" దేని గురించి మాట్లాడుతున్నావ్..?"

" అదే సుభాష్ బాబు గురించి..."

" నువ్వేం చేశావ్ ?" ఆశ్చర్యంగా చూసింది అవని.

"  నేనే చేశాను..తప్పు చేశాను.." నుదురు కొట్టుకుంది.

" ఇందులో నీ తప్పేమిటసలు ? అర్థం లేకుండా మాట్లాడుతున్నావ్ " అవని విసుక్కుంది.

పెద్దగా నిట్టూర్చింది వరాలు. " అసలు ఈ సలహా నేనేగా ఇచ్చానూ! తప్పు పనులు చేసేవాళ్ళని కనిపెట్టి, కట్టడి చేయాలని సుభాష్ బాబుకి చెప్పానా...ఆయనేమో వెంటనే అందరితో మాట్లాడి నిఘానేత్ర అని ఏర్పాటు చేశారా...ఆ నేత్ర వాళ్ళకి నారయ్య గురించి ఉప్పందించింది ఎవరనుకుంటూన్నావ్...అవనీ...నేనే..!" అంది.

అయితే ఏమిటన్నట్లుగా చూసింది అవని.

" మరి...మరి..."

అవని మొహంలో విసుగును గమనించిన వరాలు ఇక నాంచకుండా గడగడా చెప్పేసింది.

" ఇప్పుడు...మొన్నీ మధ్యన అన్నమాట...అమ్మగారూ, అయ్యగారూ అందరూ కలిసి నీ పెళ్ళి సుభాష్ బాబుతో జరిపిస్తే బావుంటుంది కదా అనుకుని ఓ మాట నిన్ను ముందు అడిగి, సుభాష్ గార్నీ అడగాలని అనుకున్నారా...ఇంతలో నేనే కదా ఈ కబురు మోసుకొచ్చానూ!

నిజమో, నిందో తెలియకపోయినా నేనే తెచ్చాను! ఆ నారయ్య వాళ్ళే...నలుగురిలో తమని చివాట్లు పెట్టి అవమానించారనే కక్ష మనసులో పెట్టుకుని ఇదంతా చేశారు! వాళ్ళ పాపం ఊరికే పోదు...ఇంతకీ ఇంతా అనుభవిస్తారు " శాపాలు పెట్టింది.

అవనికి నవ్వొచ్చింది.

" అవునుగానీ వరాలూ....ఇందులో నారయ్య వాళ్ళు చేసిన ద్రోహం ఏముంది చెప్పూ..' నిఘానేత్రా ద్వారా తమ తప్పిదాన్ని బయటపెట్టారు.

అలాంటిది ఏర్పాటు చేసినవాళ్ళే తప్పు చేస్తే...నలుగురికీ చెప్పాలనుకోరా ? వాళ్ళకు తెలిసిన కబురు అందరికీ చేరవేశారు..అంతేగా ..?"

వరాలు కళ్ళు పెద్దవి చేసి చూసింది. " ఏమంటున్నావ్ ? ఇది బయటకు వచ్చాక..అందరూ సుభాష్ బాబు తప్పు చేసినట్లుగా చూస్తారా....ఇప్పుడు అమ్మా వాళ్ళు ఈ సంబంధానికి ఎందుకు ఒప్పుకుంటారూ ?"

" పోనీ...కాన్సిల్ అవుతుంది...అంతేగా ?" చిన్నగా నవ్వింది అవని.

" అవనీ...నీకు..నీకు...అతనంటే ఇష్టమని అనుకున్నా. నీకేం బాధగా లేదా ?"

" అది సరేగానీ వరాలూ..." అంటూ అవని ఏదో చెప్పబోతూ వుండగా వరాలు మధ్యలోనే అంది. " కొన్నేళ్ళ తర్వాత ఇదంతా తెలిస్తే సరిపోయేది. ఈ లోపుగా చక్కగా మీ పెళ్ళి కూడా అయిపోయేదిగా..." నిట్టూర్చింది.

అవని మళ్ళీ చిన్నగా నవ్వింది.

" నీ ఉద్దేశ్యం ఏమిటసలు...? చేసినవాళ్ళది కాకుండా...ఆ పని బయట పెట్టినవాళ్ళదే తప్పంటావా? నారయ్యావాళ్ళు తమకు తెలిసిన సమాచారం బయటపెట్టారు..అంతేగా ? పెళ్ళికి ముందే ఇలాంటి విషయాలు బయటకి రావటమే మంచిది! నిజానిజాలు ఏమిటో తెలుసుకుని నిర్ణయించుకుంటాం! "

" అయితే అవనీ....నీకేం బాధ లేదా ? నీకు సుభాషంటే ఇష్టంకాబట్టి ఇలా జరగటంతో లోలోపల కుమిలిపోతుంటావని అనుకున్నానే ?"

అవని నిట్టూర్చింది.

" వరాలూ...సుభాష్ అంటే నాకూ ఇష్టమే ! ఎందుకనీ! అతని రూపం మాత్రమే కాదు నన్ను ఆకట్టుకున్నది! అతని వ్యక్తిత్వం నన్ను ముగ్దురాలిని చేసింది! నలుగురి ప్రయోజనాలకోసం ఇంతగా ఆలోచించి తపిస్తారా...అని నాకు చాలా ఆశ్చర్యంగానూ, అతనిపట్ల ఆరాధనా ఉంది! నిజంగా....మనల్ని మభ్యపెట్టి..మారువేషంలో కనిపించాడన్నదీ నిజమే అయితే...అంతలా ఎలా మోసపోయామా అని బాధపడతాం! తప్పదు! అంతేగానీ పెళ్ళికోసం మాత్రం కాదు! అదేమీ తొందరపడాల్సిన వ్యవహారం కాదు...నిదానంగా ఆలోచించి నిర్ణయించుకోవాల్సిన సంగతి!"

" నిజమా...నువ్వు ఇలా అనుకుంటున్నావా...సరేలే..నా వల్ల తప్పు జరిగిందేమోనని నేను బాధపడుతున్నాను. పోనీలే..నిజాలు నిదానంగా బయటకు వస్తాయి!"

" అవును...బయటకు వస్తాయి! మరేం ఫర్వాలేదు...!" అని చిరునవ్వుతో వరాలువేపు చూసింది అవని.

" నిన్ను....టిఫిన్ చేయటానికి అమ్మ పిలుస్తున్నారని చెప్పటానికి వచ్చాను. కబుర్లలో పడి ఆ మాట మరిచిపోయాను చూశావా!" అంది వరాలు.

" కాసేపు ఆగి చేస్తాలే...నాకు ఆకలిగానూ లేదు.." అని చెప్పి ఉత్తరంలోనికి చూపులు మళ్ళించింది.

******

నాన్నా...కన్నా...నీకు ఇలా రాయాల్సిన అవసరం వస్తుందని అనుకోలేదు. కానీ వచ్చింది! ఇలా అనుకోనివి ఎన్నో ఎదుర్కోవలసి రావటమే జీవితం అంటే!

నువ్వు పుట్టినప్పుడు ఎంత ఆనందం అనుభవించానో...ఇప్పుడు నిన్ను విడిచి వెళ్ళాల్సివస్తోందని అంతకు రెట్టింపు దుఃఖాన్నీ భరిస్తున్నాను!

చిన్నప్పుడు నీ మాటలూ, ఆటలూ చూసి ఎంత మురిసిపోయానో! నువ్వు నీ వయసు పిల్లలందర్నీ కూర్చోబెట్టి ఆరిందాలా అబ్బో...ఎన్ని కథలూ కబుర్లూ వినిపించేవాడివో! నాకు బాగా గుర్తుంది. మీ నాన్న స్నేహితుల కుటుంబంలోని వాళ్ళతో గడుపుతూ ఆ వయసులోనే అన్ని మతాలగురించీ...కథల గురించీ తెలుసుకుని...పిల్లలకు చెప్పటం నీకలవాటుగా ఉండేది.

నేనొకరోజు విన్నాను...నువ్వు వాళ్ళని ఓ ప్రశ్న అడగటం ' ఇప్పుడు చెప్పండిరా...ఈ కథలన్నీ విన్నాక..మీకు అర్థమయ్యేవుంటుంది. వాటి సారాంశం మాత్రం ఒకటే....మనలో మంచి పెంచాలనే! అవునా ? మరి...మనం నమ్మేందుకు ఏ దేముడు అయితేనేం..ఏ మతం అయితేనేం! " అని. నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది...ఆ వయసులో ఆ మాటలన్నీ ఏమిటని ! మతాల సారం అంటూ అలా మాట్లాడ్డం ఏమిటీ!

ఒకసారి ఇదే నిన్నూ అడిగాను. " అమ్మా...నువ్వు ఆలోచించు. ప్రపంచంలో ఎన్ని దేశాలవాళ్ళు...ఎన్నిరకాల జాతులు...ఎన్ని రకాల మతాచారాలూ...విభిన్నంగానే వుంటాయి! ఎవరి నమ్మకం వారిదేగానీ ఎవరిదీ తప్పు అని అనలేం. అందుకే....మతం మనిషి హితం కోసమే అనేదాన్నే మనం నమ్మాలి...అనుసరించాలి!"

" అప్పుడే నేను ఆలోచనలోపడ్డాను. నువ్వు ఏ దారిలో వెళ్తావ్...ప్రవచనాల ప్రచారకర్తగానా....మహనీయుల దారిలో సేవాధర్మం పాటించేవాడిగా సాగుతావా ?

ఒకసారి నువ్వు ఇంటిలో వున్నది ఎవరికో ఇచ్చావు. ' మీ తాతగారిలా ముందూ వెనకా ఆలోచించకుండా దానధర్మాలు చేసి...అసలుకే ఎసరు లా చేసుకోకూడదు ' అని విసుక్కున్నా.

" అమ్మా...నువ్వు ఇంత గిన్నెతో అన్నం వండావు...మిగిలింది ఎవరికయినా పెట్టటం మంచిదేగా ?" అనడిగావు.

" అవును..మంచిదే..అలా పెడితే పుణ్యమూ వస్తుంది. పెట్టకుండా దాచుకుంటే...ఆ అన్నమూ పనికిరాదు.." అన్నా.

" ఏదయినా అంతేనమ్మా. మన అవసరానికి మాత్రమే ఉంచుకోవాలి. మిగిలింది నలుగురితో పంచాలి! లేకపోతే ...అదీ వృథాయే! దాన్నే పెద్దవాళ్ళు ' ఏదీ మన వెంటరాదు ' ...అని చెప్పారు."

నిర్ఘాంతపోయాను! నీ రెక్కల కష్టం మీదనే బ్రతుకుతావుగానీ వారసత్వంగా వచ్చే ఆస్తిపాస్తుల మీద నీకు ఆశలేదని!

అప్పటినుండీ నీకేమీ ఆస్తిపాస్తులు మిగల్చలేదే అనే ఆరాటాన్ని తగ్గించుకున్నాను.

నువ్వు పెద్దయ్యాక నిన్నేదో చదివించాలనుకున్నాంగానీ....తర్వాత నీ చదువుని నీ అభిరుచికే వదిలేశాం! ముఖ్యంగా చెప్పదల్చుకున్న విషయం ఏమిటంటే....

మీ తాతగారి మరణం తర్వాత...ఒకసారి ఆ ఊరివాళ్ళందరూ కలిసి మీ నాన్న దగ్గరకు వచ్చారు. తాతగారు బ్రతికిఉండగా వెంకటప్పయ్య మోసం చేశాడనే ఉద్దేశ్యంతోనో, తాతగారిపట్ల గౌరవభావంతోనో నెమ్మదిగా ఉన్నవాళ్ళు...నాన్నని నిలదీశారు.

చేయగలిగిందేంలేదనీ, అమ్మి ఇవ్వటానికి ఆస్తిపాస్తులూ ఏమీ లేవనే నిజాన్ని చెప్పారు. వాళ్ళంతా ఆవేశంతో ఊగిపోయారు. బయటకు తెలియనివ్వకుండా ఏవో ఆస్తులూ ఉండే ఉంటాయనే నమ్మకం వాళ్ళది.

" జమిందారీ స్థాయి పెద్దవాళ్ళని, వ్యాపారంలో కలిస్తే లాభాలు వస్తాయనే ఆశతోనూ ఉన్నదంతా తెచ్చి మీ చేతుల్లో పెడితే...మా నెత్తిన చేతులు పెడతారా.." అని నిలదీయటమే కాదు, కొందరు తిట్టిపోశారు..మరికొందరు శాపనార్థాలు పెట్టారు.

ఆ దృశ్యం..ఆ మాటలు..నా మనసును బాగా వేధించేవి. మనశ్శాంతి వుండేది కాదు! మీ నాన్నా ఏమీ చేయలేని నిస్సహాయతతో బాధపడి...ఆ మనోవ్యధతోనే తనువు చాలించారు. చనిపోయే ముందురోజుల్లో నాకో విషయం చెప్పారు.

నా పుట్టింటివాళ్ళు నాకు ఇచ్చిన కట్నం డబ్బుతో తాతగారు ఎక్కడో కర్ణాటకలో కొంత భూమి చవకలో కొన్నారు. అది నా పేరనే ఉంది. కొన్నప్పటికంటే దాని విలువ పదింతలుగా పెరిగింది. అది అమ్మితే, జీవితం నిశ్చింతగా గడిచిపోతుందని భరోసా ఇచ్చారు.

ఆ విషయం విన్నప్పుడు నాకు ఆనందం కలుగలేదుసరికదా ఏదో భయంతో వణికిపోయా. మీ నాన్న చనిపోయాక ఆ భయం రోజురోజుకీ పెరుగుతోంది! ఆ ఆస్తిని దాచిపెట్టటం తప్పు చేయటమేగా! అది అమ్మి ఊరువాళ్ళకి ఇచ్చేస్తే బావుండేదిగా అనుకునేదాన్ని!

మన వ్యాపారంలో వాటాలుగా పెట్టి నష్టపోయినవాళ్ళందరి ఉసురు శాపంలా మన కుటుంబానికి తగిలిందనే నమ్మకం నాలో బలపడిపోయింది! ఆ మనోవేదనను భరించలేకపోతున్నాను! పదేపదే, ఆరోజు ఇంటికి వచ్చి కన్నీళ్ళతో శాపాలు పెట్టినట్లుగా అన్న మాటలే కళ్ళముందు కదలాడి, వణికిపోతూండటం మామూలు అయిపోయింది!

నువ్వయినా పదికాలాల పాటు క్షేమంగా ఉండాలి! ఏ పుణ్యం నిన్ను కాపాడుతుంది? ప్రాయశ్చింత్తంగా ఏ హోమాలూ, పూజలూ చేయాలి!

నా ఆరోగ్యం క్షీణిస్తున్న కొద్దీ పుణ్యం కోసం ఏం చేయాలి..మేం చేసిన పాపం, ఊరువాళ్ళ ఉసురు నీకు తగలకూడదు! అందుకు ఏం చేయాలని పదేపదే ఆలోచించేదాన్ని.

ఒకసారి నువ్వు పుణ్యం, పాపం అంటూ మాట్లాడిన మాటలు గుర్తుకొచ్చాయి.

' పుణ్యం అంటే...మనకు ఆనందం కలగటమేనమ్మా. కొందరికి...భగవంతుడిని ధ్యానం చేస్తూ పూజించటమే ఆనందం కలిగిస్తుంది! అదే వారికి దక్కే పుణ్యం! మరికొందరికి...ఎవరి అవసరమైనా తీర్చి ఆదుకోగలటమే ఆనందాన్ని కలిగిస్తుంది! అదీ పుణ్య ఫలితమే!

మనం చేసే పనులనుబట్టి మనం స్వర్గం...నరకం ఇక్కడే అనుభవిస్తామని పెద్దలు చెప్పలేదూ? పాపం, పుణ్యం అంటే...అదీ ఇంతే!"

అప్పుడు నాకు అనిపించింది...నువ్వు నీ పద్ధతిలో...ఆ ఊరుకు మేలు చేస్తే నీకు పుణ్యం...అదే ఆనందం కలుగుతుంది! అవును...నువ్వు నిండు నూరేళ్ళూ ఆనందంగా ఉండాలి! ఆ ఉద్దేశ్యంతోనే ఇప్పుడు నిన్నొకటి అడుగుతున్నాను.

నాకు మాట ఇచ్చాననుకుంటూ నువ్వది నేరవేర్చాలి!

నా పేరనున్న ఆ భూమి అమ్మేస్తే చాలా డబ్బు వస్తుంది! అది ఎవరికి ఇవ్వాలన్నా వీలుకాదు. ఆ తరం వెళ్ళిపోయుంటుందిగా. అందుకనే ఆ ఊరంతటికీ ప్రయోజనం చేకూరేలా ఏం చేయాలో ఆలోచించి, దానికి ఆ డబ్బు వినియోగించు!

ఇదే నాకు తోచిన ప్రాయశ్చిత్తమార్గం!

ఇది నీకు అప్పగించిన బాధ్యతగా మాత్రమే కాకుండా ఇష్టంగానూ నెరవేరుస్తావనే నమ్మకం నాకుంది. నీకు నచ్చిన ఉద్యోగం చేసుకుంటూ ధీమాగా బ్రతుకుతావు! దాచిపెట్టుకునేంత సంపాదించాలనే కోరిక నీకులేదని తెలుసు కాబట్టి...ఆ విధంగా నువ్వు ధనవంతుడివే!

అందుకే, నీ గురించి నిశ్చింతేగానీ నాకే దిగులు లేదురా!

" నీ భావాలకు అనుగుణమైన అమ్మాయే నీకు జంటగా లభించాలని ఆశీర్వదిస్తున్నాను. ఏమో...నాకెప్పుడు ఎలా వుంటుందో నాకే తెలియటంలేదు. అందుకనే ఆరోగ్యం ఈ మాత్రం కుదురుగా వున్నప్పుడే నా మనసులోని మాటను నీకు తెలియజేయాలనే తపనతో ఓపిక తెచ్చుకుని ఇదంతా రాశా! ఇంకా ఏదో ఏదో చెప్పాలని ఉందిగానీ ఏమిటో...ఎలానో కూడా తెలియటంలేదు మరి! తిరిగిరాని దానికోసం బాధపడకుండా నిబ్బరంగా ఉండటం అందరం అలవరుచుకోవాలి! సరేనా ?

--అమ్మ.

ఉత్తరం చదవటం ముగించిన అవని కళ్ళల్లోకి చేరిన నీటిని తుడుచుకుంది. ఆ ఉత్తరాన్ని సుభాష్ ఎన్నిసార్లు చదివాడోగానీ! బాగా నలిగిపోయి ఉండటాన్ని బట్టి అవని అనుకుందలా. తేలికపడిన మనసుతో ఎవరికి ఎలా తెలియజేయాలీ అనే ఆలోచనలు చేసింది చాలాసేపు.

******

వంటగదిలోకి వచ్చిన అవనిని వరాలు పట్టి పట్టి చూసింది. హుషారుగా కనిపిస్తోంది. కారణం ఏమైవుంటుందో అంతుబట్టలేదు. అవని దగ్గరకు వచ్చి " ఎందుకోగానీ...వెలిగిపోతున్నట్లుగా ఉంది నీ మొహం. కారణం ఏమిటబ్బా...?" గుసగుసగా అడిగింది.

" నీ మొహం.." నవ్వింది సరదాగా అవని.

" అవును...నా మొహం నాదేగానీ, నీ మొహంలోని ఆనందం ఏమిటో చెప్పు తల్లీ.." అని అంది చనువుగా.

" నేను చెప్పే అవసరం లేదులే. సాయంకాలానికి నువ్వే వ్యాపించిన ఆ వార్తను మోసుకువస్తావు " అంది అవని.

" నాకేం అర్థంకాలేదు. ఏం వార్త అది? నీకెలా ముందుగా తెలిసింది?"

" అది లీక్ చేసింది నేనే కాబట్టి.." చిన్నగా నవ్వింది.

అయోమయంగా చూసింది వరాలు.

******